క్లుప్తంగా

పరామర్శ



శ్రీహరిరావునాయుడి యోగక్షేమాలు అడిగి తెలుసుకుంటున్న ఎమ్మెల్యే అభ్యర్థి తలే రాజేష్

రేగిడి: మండలంలోని దేవుదళ గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ నాయకుడు, మాజీ ఎంపీటీసీ సభ్యుడు కెంబూరి శ్రీహరిరావునాయుడుని రాజాం నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ తలే రాజేష్ శుక్రవారం పరామర్శించారు. తీవ్ర అనారోగ్యానికి గురై, పలు ఆస్పత్రుల్లో చికిత్స పొందిన అనంతరం ఇంటికి చేరుకుని, కోలుకుంటున్న శ్రీహరిరావునాయుడుని కలిసి, ఆయన యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. త్వరగా కోలుకోవాలని, ఎప్పటిలాగే పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో మండల వైస్ ఎంపీపీ టంకాల అచ్చెన్నాయుడు, పార్టీ మండల అధ్యక్షుడు వావిలపల్లి జగన్మోహనరావు తదితరులు పాల్గొన్నారు.

మజ్జిగ చలివేంద్రం ఏర్పాటు



మజ్జిగ పంపిణీ చేస్తున్న సత్యసాయి భజన మండలి సభ్యులు

రేగిడి: మండలంలోని రేగిడి గ్రామంలో మజ్జిగ చలివేంద్రాన్ని సత్యసాయి భజన మండలి సభ్యులు శుక్రవారం ప్రారంభించారు. గ్రామంలోని విశ్వసాయి మందిరం వార్షికోత్సవంలో భాగంగా ఈ సేవా కార్యక్రమం చేపడుతున్నామని భజన మండలి కన్వీనర్ మామిడి శివప్రసాద్ తెలిపారు.

తలే రాజేష్‌కు త్రైత సిద్ధాంత భక్తుల మద్దతు



ఎమ్మెల్యే అభ్యర్థి రాజేష్‌తో త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రచార భక్తులు

రాజాం సిటీ: మండలంలోని బొద్దాం గ్రామానికి చెందిన త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రచార భక్తులంతా వైఎస్సార్ సీపీ రాజాం ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ తలే రాజేష్‌కు మద్దతు ప్రకటించారు. శుక్రవారం స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయానికి వారంతా చేరుకుని, మే 13వ తేదీన జరిగే ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓటేసి, గెలిపించుకుంటామన్నారు. సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి రాష్ట్రంలో కొనసాగిస్తున్న సుపరిపాలన నచ్చే తామంతా వైఎస్సార్ సీపీకి మద్దతు తెలుపుతున్నామన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ నక్క వర్షిణి, సర్పంచ్ నక్క శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

జేఈఈ మెయిన్స్‌లో విద్యార్థి సత్తా



జి.హేమంత్ కుమార్

రామభద్రపురం: జేఈఈ మెయిన్స్-2024 ఫలితాల్లో రామభద్రపురం విద్యార్థి సత్తా చాటాడు. మండల కేంద్రానికి చెందిన గొంగాడ హేమంత్‌కుమార్ 99.17 పర్సంటైల్‌తో ఆలిండియా స్థాయి ఓబీసీ కేటగిరీలో 3,162వ ర్యాంక్ సాధించాడు. ఈ మేరకు తల్లిదండ్రులు, బంధువులు, మిత్రులు అతడిని అభినందిస్తున్నారు.

రామాలయం అభివృద్ధి పనులు ప్రారంభం

వంగర: మండలంలోని కొప్పరవలస గ్రామంలో రామాలయం అభివృద్ధి పనులను శుక్రవారం ప్రారంభించారు. ఆలయ పైభాగంలో సీతారాముల విగ్రహాలు ఏర్పాటు చేయడంతో పాటు ఆలయ ముందుభాగంలో పూజలు చేసుకునేందుకు వీలుగా మండపం ఏర్పాటు చేస్తున్నట్లు గ్రామస్తులు తెలిపారు.

ముమ్మరంగా వాహన తనిఖీలు



కారు డిక్కీలో తనిఖీలు చేస్తున్న ఎస్ఐ షేక్ శంకర్

సంతకవిటి: ఎన్నికల నేపథ్యంలో పోలీసులు వాహన తనిఖీలను ముమ్మరం చేశారు. మండల కేంద్రానికి సమీపంలోని బల్క్‌మిల్క్ కూలింగ్ సెంటర్ దగ్గరలో ఎస్ఐ షేక్ శంకర్ సిబ్బందితో కలిసి శుక్రవారం వాహన తనిఖీలు నిర్వహించారు. అక్రమంగా డబ్బు, మద్యం తరలిస్తున్నదీ లేనిదీ పరిశీలించడంతో పాటు బకాయి అపరాధ రుసుంలను వాహనదారులతో చెల్లింపజేశారు. ఎన్నికల నిబంధనల ప్రకారం పరిమితికి మించి, మద్యం, డబ్బు రవాణా చేయకూడదని తెలిపారు.

ప్రజాప్రభుత్వాన్నే మళ్లీ గెలిపించుకోవాలి



బొబ్బిలిలో ఎన్నికల ప్రచారంలో ఎమ్మెల్యే శంబంగికి స్వాగతం పలికిన ప్రజలు

- ఎన్నికల ప్రచారంలో ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు

బొబ్బిలి: రాష్ట్రం బాగుండాలంటే ప్రజాప్రభుత్వమైన వైఎస్సార్ సీపీ ప్రభుత్వాన్నే మళ్లీ గెలిపించుకోవాలని ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు పిలుపునిచ్చారు. స్థానిక పట్టణంలోని 19వ వార్డులో శుక్రవారం ఎన్నికల ప్రచారం నిర్వహించిన వారికి అక్కడి ప్రజలు ఘనస్వాగతం పలికారు. అనంతరం ఇంటింటికీ వెళ్లిన వారు ఈ ఐదేళ్లలో ప్రజలకు ప్రభుత్వం చేసిన మేలును వివరించారు. రాష్ట్ర సర్వతోముఖాభివృద్ధి, ప్రజాసంక్షేమమే పరమావధిగా సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి తన ఐదేళ్ల పాలన కొనసాగించారని, ప్రజలు కూడా ఆయన పాలనకు వందకు వంద మార్కులు వేశారన్నారు. సచివాలయ వ్యవస్థను ప్రవేశపెట్టి ఎంతోమంది నిరుద్యోగ యువతకు ఉద్యోగాలు కల్పించడంతో పాటు ప్రజల వద్దకే ప్రభుత్వ సేవలు తీసుకువచ్చారన్నారు. అలాగే వలంటీర్ వ్యవస్థ రూపొందించి, లబ్ధిదారుల వద్దకే రూపాయి లంచానికి తావులేకుండా సంక్షేమ పథకాలు అందించారన్నారు. అన్నివర్గాల్లోని ప్రజలకు లబ్ధి జరిగేలా ఆయన ప్రవేశపెట్టిన పథకాలతో ప్రజల జీవన ప్రమాణాలు మెరుగయ్యాయన్నారు. ప్రజలకు ప్రభుత్వం చేస్తున్న మంచిని చూసి ఓర్వలేకనే ప్రతిపక్షాలు, ఎల్లోమీడియా కలిసి లేనిపోని ఆరోపణలతో బురదజల్లే ప్రయత్నం చేస్తున్నాయన్నారు. గతంలోని టీడీపీ పాలనకు, ఇప్పటి వైఎస్సార్ సీపీ పాలనకు ఉన్న స్పష్టమైన తేడాను గమనించాలన్నారు. మంచి జరిగితేనే ఓటు వేయమని అడిగే ధైర్యం ఒక్క వైఎస్సార్ సీపీకే ఉందని, అలా అడుగుతున్నామంటే తమ ప్రభుత్వం చేసిన మంచి మీద తమకు అంత నమ్మకమన్నారు. ఎన్నికల వేళ టీడీపీ కూటమి నేతలు చెప్పే మాయమాటలు నమ్మవద్దన్నారు. వారిచ్చే డబ్బులు, మద్యం తీసుకుని, ఓటు వేస్తే ఐదేళ్ల నరకం అనుభవించాల్సి ఉంటుందన్న విషయం మర్చిపోవద్దన్నారు. మే 13వ తేదీన జరిగే ఎన్నికల్లో ఎమ్మెల్యే, ఎంపీ ఓట్లు రెండూ ఫ్యాన్ గుర్తుకే వేసి, తమను గెలిపించాలని వారు కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఎస్వీ మురళీకృష్ణారావు, మున్సిపల్ వైస్ చైర్మన్ చెలికాని మురళీకృష్ణారావు, జేసీఎస్ జిల్లా ఇన్‌చార్జ్ శంబంగి శ్రీకాంత్, జేసీఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ శంబంగి వేణుగోపాలనాయుడు, పట్టణ ఇన్‌చార్జ్ రేజేటి ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

28న రారవే సమావేశం

రాజాం సిటీ: స్థానిక విద్యానికేతన్ స్కూల్‌లో ఈ నెల 28వ తేదీన రాజాం రచయితల వేదిక(రారవే) సమావేశం నిర్వహించనున్నట్లు రారవే నిర్వాహకులు గార రంగనాథం ఓ ప్రకటనలో శుక్రవారం తెలిపారు. ప్రముఖ సాహితీవేత్త నేతేటి గణేశ్వరరావు అధ్యక్షతన జరగనున్న ఈ సమావేశంలో 'నీతి చంద్రిక-చిన్నయ గద్యశైలి' అనే అంశంపై ఒమ్మి రమణ మూర్తి ప్రసంగించనున్నారన్నారు. రచయితలు, భాషాభిమానులు, కవులు ఈ సమావేశానికి హాజరుకావాలని ఆయన కోరారు.

ఆధ్యాత్మికతతోనే మానసిక ప్రశాంతత

రేగిడి: ఆధ్యాత్మికతతోనే మానసిక ప్రశాంతత అని, ప్రతిఒక్కరూత ఆధ్యాత్మిక భావాలు పెంపొందించుకోవాలని పాలకొండకు చెందిన ఆధ్యాత్మిక వక్త ఎస్.వి.రమణ అన్నారు. మండలంలోని వావిలవలస గ్రామంలోని శ్రీరామ ధర్మక్షేత్రంలో వారణాసి జగన్నాథస్వామి ఆధ్వర్యంలో ఆధ్యాత్మిక దివ్య మహాసభ శుక్రవారం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య వక్తగా హాజరైన ఆయన చెట్లు ఫలాలను కాసి, ఇతరులకు ఉపయోగపడుతున్నాయని, నదులు ప్రవహిస్తూ ఇతరులకు ఉపయోగపడుతున్నాయని, గోవులు కూడా పాలిచ్చి, పరోపకారం చేస్తున్నాయని తెలిపారు. మానవులు కూడా ఇతరులకు ఉపయోగపడాలని, తమకు చేతనైన సాయం ఇతరులకు చేయాలన్నారు. జగన్నాథస్వామి చిరు వ్యాపారి అయినప్పటికీ ఆయనలో దాతృత్వ గుణం ఉండడంతో నిత్యం అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తుండడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. ప్రతిఒక్కరూ సమాజ సేవకు ముందుకురావాలన్నారు.

వైఎస్సార్ సీపీతోనే ప్రజలకు మరింత మేలు



వాడాడలో ఎన్నికల ప్రచారంలో మాట్లాడుతున్న ఎంపీ బెల్లాన పక్కనే ఎమ్మెల్యే శంబంగి

- ఎన్నికల ప్రచారంలో ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు

బాడంగి: వైఎస్సార్ సీపీతోనే ప్రజలకు మరింత మేలు అని, రానున్న ఎన్నికల్లోనూ ఫ్యాన్ గుర్తుకే మళ్లీ ఓటు వేసి, సీఎం జగనన్నను మరోసారి ముఖ్యమంత్రిని చేయాలని ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు కోరారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా మండలంలోని వాడాడ, కోటిపల్లి, గూడెపువలస, మల్లంపేట, పాల్తేరు, బొత్సవానివలస, పూడివలస గ్రామాల్లో శుక్రవారం పర్యటించిన ఎంపీ, ఎమ్మెల్యేలకు ఆయా గ్రామాల ప్రజలు సాదరస్వాగతం పలికారు. అనంతరం ఇంటింటికీ వెళ్లిన వారు ఈ ఐదేళ్లలో ప్రభుత్వం ద్వారా కలిగిన లబ్ధిని వివరించారు. సచివాలయ వ్యవస్థ ద్వారా మహాత్మాగాంధీ కలలుగన్న గ్రామస్వరాజ్యంను తీసుకువచ్చిన ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డిదేనన్నారు. ఇప్పుడు ప్రతీ గ్రామంలోని సచివాలయం ద్వారా ప్రజలకు ప్రభుత్వ సేవలను పారదర్శకంగా అందజేయడం జరుగుతోందన్నారు. వలంటీర్ వ్యవస్థ ద్వారా కుల, మత, రాజకీయ పార్టీలకు అతీతంగా పథకాలు అందజేయడం జరుగుతోందన్నారు. ఎన్నికల మేనిఫెస్టోలోని 99 శాతం హామీలను నెరవేర్చారని, వీటితో పాటు సభలు, సమావేశాలు, సదస్సుల్లో ఇచ్చిన మరెన్నో హామీలను కూడా జగనన్న అమలు చేశారన్నారు. ప్రభుత్వ పథకాలతో ప్రజల జీవన ప్రమాణాలు మెరుగయ్యాయన్నారు. ఎన్నికల వేళ మాయమాటలు, మోసపూరిత హామీలతో అధికారం కోసం ఎగబడుతున్న టీడీపీ కూటమి నేతలను నమ్మవద్దన్నారు. రాష్ట్రంలో ప్రస్తుతం జరుగుతున్న అభివృద్ధి, సంక్షేమం కొనసాగాలంటే మే 13వ తేదీన జరిగే ఎన్నికల్లోనూ ఎంపీ, ఎమ్మెల్యే ఓట్లు రెండూ ఫ్యాన్ గుర్తుకే వేసి, తమను గెలిపించి, వైఎస్సార్ సీపీ ప్రభుత్వాన్ని అధికారంలోకి తీసుకురావాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో జిల్లా జేసీఎస్ కన్వీనర్ శంబంగి శ్రీకాంత్, జెడ్పీటీసీ పెద్దింటి రామారావు, ఎంపీపీ భోగి గౌరి, పార్టీ మండల అధ్యక్షుడు బి.వెంకటనాయుడు, జేసీఎస్ కన్వీనర్ ఎం.శంకరరావు తదితరులు పాల్గొన్నారు.

నిర్దేశిత కొలతల్లో పనిచేస్తే రోజుకు రూ.300



వేతనదారులకు సూచనలిస్తున్న ఏపీవో హరనాథరావు

సంతకవిటి: నిర్దేశిత కొలతల ప్రకారం పనులు చేస్తే రోజుకు రూ.300 గిట్టుబాటు అయ్యే వేతనం లభిస్తుందని ఏపీవో హరనాథరావు అన్నారు. మండలంలోని తాలాడ గ్రామ గంగన్నచెరువు వద్ద జరుగుతున్న ఉపాధి హామీ పనులను ఆయన శుక్రవారం పరిశీలించారు. ఎండల తీవ్రత అధికంగా ఉన్న నేపథ్యంలో వడదెబ్బ బారినపడకుండా రోజుకు రెండు పూటలా చల్లగా ఉన్న సమయంలో పనులు చేసుకోవాలని సూచించారు. ఉదయం 6 గంటల నుంచి 11 గంటల వరకు, సాయంత్రం 4 గంటల నుంచి 6 గంటల వరకు పనులు చేసుకుంటే ఎండల నుంచి తప్పించుకోవచ్చన్నారు. పని ప్రదేశంలో చలువ పందిర్లు వేసుకోవాలని, అలాగే తాగునీరు, ప్రథమ చికిత్స కిట్ అందుబాటులో ఉంచుకోవాలని తెలిపారు.

ఫ్యాన్ ప్రభంజనం ఖాయం



తిమ్మయ్యపేటలో ఎన్నికల ప్రచారంలో ప్రజాసమస్యలను అడిగి తెలుసుకుంటున్న ఎమ్మెల్యే అభ్యర్థి తలే రాజేష్

- వైఎస్సార్ సీపీ రాజాం ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ తలే రాజేష్

రాజాం: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో రాష్ట్ర వ్యాప్తంగా ఫ్యాన్ ప్రభంజనం ఖాయమని, మళ్లీ జగనన్న ప్రభుత్వమే అధికారంలోకి వస్తుందని వైఎస్సార్ సీపీ రాజాం ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ తలే రాజేష్ అన్నారు. స్థానిక మున్సిపాలిటీ పరిధిలోని తిమ్మయ్యపేట, బాబానగర్ ప్రాంతాల్లో శుక్రవారం ఎన్నికల ప్రచారం నిర్వహించిన ఆయనకు అక్కడి ప్రజలు ఘనస్వాగతం పలికారు. అనంతరం ఇంటింటికీ వెళ్లిన ఆయన ఈ ఐదేళ్లలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం చేసిన అభివృద్ధి, సంక్షేమం వివరించారు. రాష్ట్రంలోని అన్ని ప్రాంతాలతో పాటు అన్ని వర్గాల ప్రజలు బాగుండాలనే మంచి మనసుతో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తన ఐదేళ్ల పాలనలో సుపరిపాలన అందించారన్నారు. కుల, మత, రాజకీయ పార్టీలకు అతీతంగా అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు అందించారని, ప్రతీ గ్రామ సచివాలయం పరిధిలో ప్రజల మౌలిక సదుపాయాలకు ప్రాధాన్యమిస్తూ అభివృద్ధి పనులు చేయించారన్నారు. ఎన్నికల వేళ అధికార దాహంతో మోసపూరిత మాటలు, అబద్ధపు హామీలతో ఇంటికి వస్తున్న టీడీపీ కూటమి నేతలను నమ్మవద్దన్నారు. ఇచ్చిన మాటకు కట్టుబడి, ఎన్నికల మేనిఫెస్టోలో పేర్కొన్న ప్రతీ హామీని నెరవేర్చిన జగనన్న ప్రభుత్వానికే మళ్లీ పట్టంకట్టాలన్నారు. మే 13న జరిగే ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకే ఎమ్మెల్యే, ఎంపీ ఓట్లు రెండూ వేసి, తొలిసారిగా ఎమ్మెల్యేగా పోటీ చేస్తున్న తనను, ఎంపీగా మరోసారి బరిలో ఉన్న బెల్లాన చంద్రశేఖర్‌ను గెలిపించాలని అభ్యర్థించారు. కార్యక్రమంలో పార్టీ రాజాం పట్టణ అధ్యక్షుడు పాలవలస శ్రీనివాసరావు, జేసీఎస్ కన్వీనర్ పాలవలస గోపి, యూత్ అధ్యక్షుడు వంజరాపు విజయ్ కుమార్, పార్టీ మహిళా నాయకులు కోలా రమ్య, యందవ సుశీల తదితరులు పాల్గొన్నారు.

రూ.1.30 కోట్లతో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు



పూజలు చేసి, ట్రాన్స్‌ఫార్మర్‌ను ప్రారంభిస్తున్న విద్యుత్ శాఖ ఈఈ సురేష్‌బాబు

రాజాం సిటీ: మండలంలోని బొద్దాం సబ్‌స్టేషన్ పరిధిలో రూ.1.30 కోట్ల వ్యయంతో కొత్తగా ఏర్పాటు చేసిన అదనపు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను విద్యుత్ శాఖ ఈఈ జి.సురేష్‌బాబు శుక్రవారం ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పెరుగుతున్న అవసరాల నేపథ్యంలో విద్యుత్ సరఫరాలో తలెత్తుతున్న సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టామన్నారు. ఇప్పుడు రైతువారీ పనులతో పాటు గృహావసరాలకు అవసరమైన విద్యుత్ లభిస్తుందన్నారు. వేసవిలో పూర్తిస్థాయిలో విద్యుత్ సదుపాయం ఉండేలా చర్యలు తీసుకున్నామన్నారు. ఇప్పటికే పట్టణ పరిధిలోని గోపాలపురం సబ్‌స్టేషన్‌లో రూ.1.25 కోట్లతో అదనంగా మరో పవర్ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేశామన్నారు. అలాగే నియోజకవర్గంలో నాలుగు సబ్‌స్టేషన్ల నిర్మాణాలకు ప్రతిపాదనలు కూడా పంపించామన్నారు. ఒక్కో సబ్‌స్టేషన్‌కు రూ.కోట్లతో అంచనాలు రూపొందించామన్నారు. ప్రజలు డిజిటల్ పేమెంట్ల వైపు మొగ్గు చూపాలని, విద్యుత్ బిల్లులను 14 రోజుల్లోపు చెల్లిస్తే సర్‌చార్జి మినహాయింపు ఇవ్వడం జరుగుతోందన్నారు. విద్యుత్ సమస్యలు వస్తే టోల్‌ఫ్రీ నంబర్ 1912కు సంప్రదించాలని కోరారు. కార్యక్రమంలో ఏడీఈ ఫణీంద్రకుమార్, రూరల్ ఏఈ వావిలపల్లి సురేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పాలిసెట్ పరీక్షకు సర్వం సిద్ధం

బొబ్బిలి: పాలిసెట్ పరీక్షకు సర్వం సిద్ధం చేశారు. పట్టణం సహా మండలంలోని ఏడు కేంద్రాల్లో జరిగే ఈ ప్రవేశ పరీక్షకు సంబంధించి, అన్ని ఏర్పాట్లు చేశామని అధికారులు తెలిపారు. బొబ్బిలి, కలువరాయి, కోమటిపల్లి తదితర ప్రాంతాల్లోని కళాశాలల్లో శనివారం ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు పరీక్ష జరగనుంది. ఈ మేరకు పరీక్షల ఏర్పాట్లను అబ్జర్వర్ శ్రీనివాసరావు, కో-ఆర్డినేటర్ ఉదయభాస్కరరావులు పరిశీలించి, సంతృప్తి వ్యక్తం చేశారు.

రెండు నామినేషన్లు తిరస్కరణ



నామినేషన్ల వివరాలు వెల్లడిస్తున్న ఎన్నికల రిటర్నింగ్ అధికారి జోసెఫ్

రాజాం: నియోజకవర్గంలో ఎమ్మెల్యే స్థానానికి 20 నామినేషన్లు దాఖలు కాగా, ఎన్నికల అధికారులు స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో నామినేషన్ల స్క్రూటినీ శుక్రవారం నిర్వహించారు. మొత్తం 12 మంది అభ్యర్థులు 20 నామినేషన్లు దాఖలు చేశారని, ఇందులో వైఎస్సార్ సీపీ, టీడీపీలకు సంబంధించి, డమ్మీ నామినేషన్ వేసిన రెండింటిని తిరస్కరించినట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి జోసెఫ్ తెలిపారు. మిగతా 18 నామినేషన్లు సక్రమంగా ఉన్నాయన్నారు. వీటిలో వైఎస్సార్ సీపీ తరఫున డాక్టర్ తలే రాజేష్, టీడీపీ తరఫున కోండ్రు మురళీ మోహన్, బహుజన సమాజ్ పార్టీ తరఫున బొత్స బుద్ధుడు, కాంగ్రెస్ పార్టీ తరఫున కంబాల రాజవర్ధన్, ఇండిపెండెంట్ అభ్యర్థిగా ఎన్ని రాజు, జైభీమ్ రావ్ పార్టీ తరఫున పొడుగు రామకృష్ణ, జై భారత్ నేషనల్ పార్టీ తరఫున కుప్పిలి చైతన్యకుమార్, స్వతంత్ర అభ్యర్థులుగా గండి అప్పారావు, మజ్జి గణపతి, మన్నేన రమేష్‌ల నామినేషన్లు ఉన్నాయన్నారు. పోటీ నుంచి వైదొలిగే అభ్యర్థులు ఈ నెల 29వ తేదీన తమ నామినేషన్ పత్రాలను ఉపసంహరించుకోవచ్చన్నారు.

బొబ్బిలి: నియోజకవర్గ అసెంబ్లీ స్థానానికి సంబంధించి, అభ్యర్థులు వేసిన నామినేషన్లను ఎన్నికల అధికారులు శుక్రవారం పరిశీలించారు. మొత్తం 27 నామినేషన్లు దాఖలు కాగా, డమ్మీలు, దరఖాస్తులు సక్రమంగా నింపని వారి నామినేషన్లు తిరస్కరించామని అధికారులు తెలిపారు. నామినేషన్లు వేసిన వారిలో శంబంగి వెంకట చినఅప్పలనాయుడు(వైఎస్సార్ సీపీ), ఆర్‌వీఎస్‌కేకే రంగారావు(టీడీపీ), మరిపి విద్యాసాగర్(కాంగ్రెస్), సవలాపురం రమణ(బీఎస్పీ), ఆరెడ్డి కిరణ్‌కుమార్(సమాజ్‌వాదీ పార్టీ), మరడాన వెంకటనాయుడు(జైభీమ్ రావ్ భారత్ పార్టీ), ఆకేటి ప్రశాంత్(స్వతంత్ర), మర్రాపు భానుమూర్తి(స్వతంత్ర), ముగడ వెంకటరమణ(స్వతంత్ర) ఉన్నారు.

జగనన్నను మళ్లీ ముఖ్యమంత్రిని చేయండి



రాజాం సిటీ: రాజాం మల్లిఖార్జున కాలనీలో ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే అభ్యర్థి తలే రాజేష్ సతీమణి మాధవీలత

వైఎస్సార్ సీపీ నేతలు ఎన్నికల ప్రచారంలో నిమగ్నమయ్యారు. ప్రతిరోజూ ఇంటింటికీ వెళ్లి, ప్రభుత్వం చేసిన మంచిని వివరిస్తున్నారు. శుక్రవారం జరిగిన ప్రచారంలో పాల్గొన్న నాయకులంతా.. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంతోనే రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమం కొనసాగింపు సాధ్యమని, మే 13న జరిగే ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకే అందరూ ఓటేసి, సీఎం జగనన్నను మళ్లీ ముఖ్యమంత్రిని చేయాలని కోరారు.

–సాక్షి నెట్‌వర్క్.



తెర్లాం: రంగప్పవలసలో ఎన్నికల ప్రచారంలో వైఎస్సార్ సీపీ నేతలు



రామభద్రపురం మారుతీ కాలనీలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న ఎంపీపీ లక్ష్మణరావు, తదితరులు



తెర్లాం: తమ్మయ్యవలసలో ఎన్నికల ప్రచారంలో పార్టీ మండల అధ్యక్షుడు సత్యంనాయుడు, తదితరులు



రేగిడి: చిన్నశిర్లాంలో ఎన్నికల ప్రచారంలో జై జగన్ నినాదాలు చేస్తున్న వైస్ ఎంపీపీ అచ్చెన్నాయుడు, తదితరులు



రాజాం: కొఠారిపురంలో ఎన్నికల ప్రచారం చేస్తున్న జెడ్పీటీసీ నర్సింహులు, తదితరులు



బొబ్బిలి పట్టణంలో వైఎస్సార్ సీపీ మహిళా నేతల ప్రచారం



మెంటాడ: ఇద్దనవలసలో ఇంటింటికీ వెళ్లి, ఫ్యాన్ గుర్తుకు ఓటేయాలని కోరుతున్న వైఎస్సార్ సీపీ నేతలు